# హరీశ్‌రావు జోలికొస్తే ఊరుకునేది లేదు

**బీఆర్‌ఎస్వీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శిశుపాల్**


సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

చేవెళ్ల రూరల్, డిసెంబర్ 4: సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు జోలికొస్తే ఊరుకునేది లేదని బీఆర్‌ఎస్వీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కోనపురం శిశుపాల్ అన్నారు. బుధవారం చేవెళ్లలో విలేకరులతో మాట్లాడుతూ.. చక్రధర్ అనే వ్యక్తి హరీశ్‌రావుపై ఫోన్ ట్యాపింగ్ కేసు పెట్టడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. హరీశ్‌రావు పదేండ్లలో రాష్ట్ర అభివృద్ధికి పనిచేశారని, ఫోన్ ట్యాపింగ్‌లు చేయాల్సిన అవసరం లేదన్నారు. హరీశ్‌రావును అరెస్టు చేస్తారని ప్రచారం చేస్తున్నారని, అదే జరిగితే ఉద్యమాలు చేస్తామన్నారు. ఫిర్యాదు చేసిన చక్రధర్‌ను అరెస్ట్ చేయాలని, అతడిపై 10కి పైగా కేసులు ఉన్నాయన్నారు. కార్యక్రమంలో నాయకులు జంగయ్య, దత్తాత్రేయ, ఆర్తిక్, శ్రీకాంత్ ఉన్నారు.

## ప్రతిఒక్కరూ సేవాభావాన్ని అలవర్చుకోవాలి

**రోడ్డు డెవలప్‌మెంట్ అథారిటీ చైర్మన్ మల్‌రెడ్డి రంగారెడ్డి**


రామచంద్రయ్యను సన్మానిస్తున్న మల్‌రెడ్డి రాంరెడ్డి

రంగారెడ్డి, డిసెంబర్ 4 (నమస్తేతెలంగాణ) : ప్రతిఒక్కరూ సేవాభావాన్ని అలవర్చుకోవాలని రాష్ట్ర రోడ్డు డెవలప్‌మెంట్ అథారిటీ చైర్మన్ మల్‌రెడ్డి రాంరెడ్డి అన్నారు. స్వచ్ఛంద సంస్థ ఏర్పాటుచేసి ప్రజాసేవలో 50ఏళ్లు పూర్తిచేసుకున్న వివేకానంద సేవా సంఘం రాష్ట్ర కార్యదర్శి వారాల పెద్దరామచంద్రయ్య యాదవ్‌ను ఆయన బుధవారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా రాంరెడ్డి మాట్లాడుతూ.. రామచంద్రయ్యాయాదవ్ నిస్వార్థంతో ప్రజాసేవకు అంకితమై ప్రజల మన్ననలు పొందటం ఎంతో అభినందనీయమన్నారు. ఆయనను స్ఫూర్తిగా తీసుకుని నేటి యువత సంఘసేవ అలవాటు చేసుకోవాలన్నారు. రామచంద్రయ్యాయాదవ్ చేసిన సేవలకు గుర్తింపుగా గతంలో రాష్ట్రస్థాయి ఉత్తమసేవా అవార్డును అందుకున్నారన్నారు. రాష్ట్రంతో పాటు ఇతర ప్రాంతాల్లో రామచంద్రయ్యాయాదవ్ ప్రజాసేవలకు అంకితమయ్యారన్నారు. ఆయన ఆశయాలను నేటి యువత ఆదర్శంగా తీసుకోవాలని ఆయన తెలిపారు. కార్యక్రమంలో పలు సేవాసంస్థల నాయకులు, క్రిస్టియన్ సంఘం నాయకులు పాల్గొన్నారు.

## మార్కెట్ కమిటీ చైర్మన్‌గా గురునాథ్‌రెడ్డి

ఇబ్రహీంపట్నంరూరల్, డిసెంబర్ 4 : ఇబ్రహీంపట్నం మార్కెట్‌కమిటీ చైర్మన్‌గా కంబాలపల్లి గురునాథ్‌రెడ్డిని నియమిస్తూ బుధవారం మార్కెటింగ్‌శాఖ అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. వైస్‌చైర్మన్‌గా మంఖాల కరుణాకర్‌తో పాటు మరో 12మందిని డైరెక్టర్లుగా నియమించారు. డైరెక్టర్లుగా మల్లిక, లింగస్వామి, కరుణాకర్‌రెడ్డి, రాజు, మహేశ్, పాండు, ఎల్లయ్య, గులాం అక్బర్, నర్సింహ, శివకుమార్, రాఘవేందర్‌రెడ్డిలను ఎన్నుకున్నారు. ఈ మేరకు మార్కెటింగ్‌శాఖ అధికారులు బుధవారం ఉత్తర్వులు జారీచేశారు.


గురునాథ్‌రెడ్డి, మార్కెట్‌కమిటీ చైర్మన్


కరుణాకర్, మార్కెట్‌కమిటీ వైస్‌చైర్మన్

## ప్రతిఒక్కరూ భక్తిభావంతో మెలగాలి



ఆమనగల్లు, డిసెంబర్ 4: ప్రతిఒక్కరూ భక్తిభావంతో మెలగాలని రామదూత ఆశ్రమం వ్యవస్థాపకుడు శివానంద స్వామి అన్నారు. అభయాంజనేయ భజన మండలి ఆధ్వర్యంలో నెల రోజుల పాటు నిర్వహించిన కార్తిక మాస ఆకు పూజల ముగింపు సందర్భంగా బుధవారం పట్టణంలోని అంగడి బజార్ హనుమాన్ ఆలయంలో ఆంజనేయ స్వామికి అభిషేకాలు, హోమం, పూజలు చేశారు. ఈ సందర్భంగా అభయాంజనేయ భజన మండలి అధ్యక్షుడు వల్లబుదాసు నారాయణగౌడ్ అధ్యక్షతన నిర్వహించిన పూజా కార్యక్రమాలకు రామదూత ఆశ్రమ వ్యవస్థాపకుడు శివానంద స్వామి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. కార్యక్రమంలో కార్యదర్శి సత్యనారాయణ, గౌరవ అధ్యక్షుడు దామోదరాచారి, సహాయ కార్యదర్శి బుచ్చిరాములు, సభ్యులు జంగయ్య, కృష్ణయ్య, భాస్కర్, దశరథం, నాగభూషణం, మాధవచారి, ఆంజనేయులు, పార్థసారథి, కృష్ణయ్య, లక్ష్మయ్య, చక్రపాణి, రఘు, మనోహర్, రాములు, భద్రయ్య, వేదశ్రీ, నిరంజన్, అర్చకుడు రామకృష్ణాచార్యులు పాల్గొన్నారు.

## గోర్‌బోలి భాషను 8వ షెడ్యూల్‌లో చేర్చాలి



యువజన విభాగం కమిటీకి నియామక పత్రాన్ని అందజేస్తున్న రాష్ట్ర అధ్యక్షుడు రాంబల్ నాయక్

షాద్‌నగర్‌టౌన్, డిసెంబర్ 4 : లంబాడీలు మాట్లాడే గోర్‌బోలి భాషను భారత రాజ్యాంగంలోని 8వ షెడ్యూల్‌లో చేర్చాలని లంబాడీ హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు రాంబల్‌నాయక్ డిమాండ్ చేశారు. షాద్‌నగర్ పట్టణంలోని ఓ కన్వెన్షన్ హాల్‌లో బుధవారం లంబాడీ హక్కుల పోరాట సమితి నాయకులతో ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2026లో జరిగే నియోజకవర్గ పునర్విభజనలో భాగంగా గిరిజనులకు అసెంబ్లీ నియోజకవర్గాలను కేటాయించాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అనధికారికంగా అగ్రవర్ణాల విద్యార్థులకు మేలు చేయడం కోసం తీసుకొచ్చిన జీవో 29తో ఎస్టీ, ఎస్సీ, బీసీల విద్యార్థులకు తీవ్ర అన్యాయం జరుగుతుందని, వెంటనే జీవో 29ను రద్దు చేయడంతో పాటు గ్రూప్-1, ఉద్యోగాల నియామక నోటిఫికేషన్ ఇవ్వాలన్నారు. అదే విధంగా ప్రభుత్వ వసతి గృహాలు, పాఠశాలల్లో, యూనివర్సిటీల్లో ఎంతో మంది గిరిజన విద్యార్థులు చదువుతున్నారని, వారికి కనీస మౌలిక వసతులు కల్పించడంలేదన్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లు విడుదల చేయకుండా విద్యార్థులకు తీవ్ర అన్యాయం చేసిందన్నారు. ప్రభుత్వం స్పందించి వసతి గృహాల్లో మౌలిక వసతులను కల్పించడంతో పాటు ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలన్నారు. అనంతరం యువజన కమిటీతో పాటు లంబాడీ హక్కుల పోరాట సమితి రాష్ట్ర ఉపాధ్యక్షులుగా దశరథ్‌నాయక్, ప్రధాన కార్యదర్శిగా చందర్‌నాయక్‌ను ఎన్నుకున్నారు.

**యువజన విభాగం కమిటీ ఎన్నిక**

లంబాడీ హక్కుల పోరాట సమితి షాద్‌నగర్ యువజన విభాగం కమిటీ ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు లంబాడీ హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు రాంబల్‌నాయక్ తెలిపారు. యువజన కమిటీ అధ్యక్షుడిగా సంజూనాయక్, కార్యనిర్వాహక అధ్యక్షుడిగా శ్రీనివాస్, ఉపాధ్యక్షులుగా వెంకట్, అంబాదాస్, పవన్, ప్రధాన కార్యదర్శిగా పరశురాం, కార్యదర్శులుగా రాజేశ్, హన్మంత్, కోశాధికారి రాజు, సభ్యులు శేఖర్, దేవేశ్, ప్రవీణ్, పాండును ఎన్నుకున్నారు. కార్యక్రమంలో నాయకులు లక్ష్మణ్, రాజు, మోహన్, సుధాకర్, శ్రీనివాస్, రాజు, మోతీలాల్, సంతోష్ పాల్గొన్నారు.

## మొక్కల పెంపకాన్ని పకడ్బందీగా నిర్వహించాలి


నర్సరీలోని మొక్కలను పరిశీలిస్తున్న ఎంపీడీవో నరేందర్‌రెడ్డి

యాచారం, డిసెంబర్4: నర్సరీల్లో మొక్కల పెంపకాన్ని పకడ్బందీగా నిర్వహించాలని ఎంపీడీవో నరేందర్‌రెడ్డి అన్నారు. మండలంలోని పలు గ్రామాల్లో బుధవారం ఆయన పర్యటించారు. గ్రామాల్లో నర్సరీల నిర్వహణను ఆయన పరిశీలించారు. అనంతరం గ్రామాల్లో ఎంపిక చేసిన పోలింగ్ కేంద్రాలను సైతం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నర్సరీల్లో పెంచుతున్న మొక్కలను సంరక్షించాలని కోరారు. మొక్కలకు క్రమం తప్పకుండా నీరు అందించాలన్నారు. ఎండిపోయిన మొక్క స్థానంలో కొత్తవి నాటాలన్నారు. త్వరలో జరిగే పంచాయతీ ఎన్నికలకు పోలింగ్ కేంద్రాలను సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు. పోలింగ్ కేంద్రాల్లో అన్ని రకాల వసతులు, సౌకర్యాలు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఇందుకోసం అన్ని రకాల చర్యలు తీసుకుంటామన్నారు.

## దివ్యాంగులను సమానంగా చూడాలి


హిమాయత్‌నగర్‌లో దివ్యాంగుల పిల్లల తల్లులను సన్మానిస్తున్న అధికారులు

మొయినాబాద్, డిసెంబర్ 4 : దివ్యాంగులను సకలాంగులతో సమానంగా చూడాలని మండల పరిషత్ అభివృద్ధి అధికారి సంధ్య అన్నారు. మండల పరిధిలోని హిమాయత్‌నగర్ గ్రామంలో బుధవారం దివ్యాంగుల దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అంగవైకల్యం శరీరానికి తప్ప మానసికంగా కాదని, తల్లిదండ్రులు తమ పిల్లలను సకలాంగులతో సమానంగా ప్రోత్సహించాల్సిన అవసరం ఉన్నదని పేర్కొన్నారు. తల్లిదండ్రులు తమ దివ్యాంగ పిల్లలకు విద్యాబుద్ధులు నేర్పిస్తే వారు మంచి భవిష్యత్‌ను నిర్మించుకుంటారని అన్నారు. కార్యక్రమంలో మండల విద్యాధికారి వెంకటయ్య, మండల వ్యవసాయ అధికారి అనురాధ, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఆంజనేయులు, స్పెషల్ ఎడ్యుకేషన్ టీచర్లు సుగుణ, కావేరి, ఉపాధ్యాయులు రాములు, కళావతి, భాగ్యలక్ష్మి పాల్గొన్నారు.

## శ్రీకాంత్‌కు ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలి


సమావేశంలో పాల్గొన్న కేవీపీఎస్, ప్రజాసంఘాల నాయకులు

ఇబ్రహీంపట్నంరూరల్, డిసెంబర్ 4 : మహిళా కానిస్టేబుల్ నాగమణిది ఆస్తిగొడవ కాదని... కులోన్మాద హత్య అని కేవీపీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి స్కైలాబ్‌బాబు అన్నారు. ఆస్తిగొడవగా చిత్రీకరించే ప్రయత్నం చేయటం సరికాదన్నారు. ఇబ్రహీంపట్నం మండలం రాయపోల్ గ్రామానికి చెందిన మహిళా కానిస్టేబుల్ నాగమణి హత్యను నిరసిస్తూ కేవీపీఎస్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఇబ్రహీంపట్నం పాషా, నరహరి స్మారక కేంద్రంలో బుధవారం రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో పలు ప్రజాసంఘాలు, కులసంఘాలు, వివిధ కార్మిక సంఘాలు హాజరయ్యాయి. నాగమణి హత్యను నిరసిస్తూ స్కైలాబ్‌బాబు మాట్లాడుతూ.. కుల నిర్మూలనే ప్రధాన లక్ష్యంగా బలమైన పోరాటాలు నిర్వహించాల్సిన అవసరం ఉందన్నారు. కులాంతర, మతాంతర వివాహాల రక్షణ చట్టం తీసుకురావాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కులాంతర వివాహాలు చేసుకున్న వారికి ప్రభుత్వం ప్రోత్సాహకం ఇవ్వటం లేదన్నారు. నాగమణిని హత్యచేసిన వారికి ఉరిశిక్ష వేయాలన్నారు....నాగమణి భర్త శ్రీకాంత్‌కు ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో కేవీపీఎస్ జిల్లా అధ్యక్షుడు సామెల్, నాయకులు రఘుపతి, పురుషోత్తం, జగన్, అరుణ, జగన్, కృష్ణయ్య, మారయ్య, శంకర్, చరణ్, తరంగ్, శ్రీకాంత్, రాజు, కిషన్ పాల్గొన్నారు.

## సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన


సీసీ రోడ్డు పనులు ప్రారంభిస్తున్న చైర్‌పర్సన్ జయశ్రీ, వైస్ చైర్‌పర్సన్ సంపూర్ణారెడ్డి తదితరులు

పెద్దఅంబర్‌పేట, డిసెంబర్ 4: మున్సిపాలిటీ అభివృద్ధికి అన్ని విధాలా చర్యలు చేపడుతున్నట్టు చైర్‌పర్సన్ జయశ్రీ అన్నారు. పెద్దఅంబర్‌పేట 7వ వార్డు పరిధిలో రూ.8 లక్షల నిధులతో చేపడుతున్న సీసీ రోడ్డు పనులకు బుధవారం కౌన్సిలర్ కృష్ణారెడ్డితో కలిసి ఆమె శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పనులు నాణ్యతగా చేపట్టాలని, సకాలంలో పూర్తిచేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకుని రావాలని సూచించారు. కార్యక్రమంలో వైస్ చైర్‌పర్సన్ సంపూర్ణారెడ్డి, కమిషనర్ రవీందర్‌రెడ్డి, కౌన్సిలర్ రాజేందర్ ముదిరాజ్, నాయకులు విజయ్‌శేఖర్‌రెడ్డి, రాజు పాల్గొన్నారు.

## సమీకృత మార్కెట్ ఏర్పాటు హర్షణీయం

అబ్దుల్లాపూర్‌మెట్, డిసెంబర్ 4 : అబ్దుల్లాపూర్‌మెట్ మండల పరిధిలోని కొహెడ రెవెన్యూ పరిధిలో 250 ఎకరాల్లో రూ. 2వేల కోట్లతో అంతర్జాతీయ సమీకృత మార్కెట్ (పండ్లు, కూరగాయలు, డెయిరీ ఉత్పత్తులు) ఏర్పాట్లు చేస్తున్నట్లు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రకటించడం హర్షణీయమని గడ్డిఅన్నారం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ చిలుక మధుసూదన్‌రెడ్డి అన్నారు. ఈ సందర్భంగా చైర్మన్ మధుసూదన్‌రెడ్డి మాట్లాడుతూ ప్రజా ప్రభుత్వంలో అధునాతన మార్కెట్‌ను నిర్మిస్తామన్నారు. కార్యక్రమంలో గడ్డిఅన్నారం వ్యవసాయ పండ్ల మార్కెట్ వైస్ చైర్మన్ చౌదరిమెట్టు భాస్కరచారి, డైరెక్టర్లు మధుసూదన్‌రావు, జైపాల్‌రెడ్డి, అంజయ్య, రఘుపతిరెడ్డి, గణేశ్‌నాయక్, నరసింహ, నవరాజ్, గోవర్ధన్‌రెడ్డి, వెంకటేశ్వర్లుగుప్తా, ఇబ్రహీం, మార్కెట్ కమిటీ ఉన్నతశ్రేణి కార్యదర్శి శ్రీనివాస్, సూపర్‌వైజర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

## విద్యార్థినులకు సైకిళ్ల పంపిణీ

చేవెళ్లరూరల్, డిసెంబర్ 4: చేవెళ్ల మండలం తంగడిపల్లిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థినులకు హైదరాబాద్‌కు చెందిన రోటరీ క్లబ్ చేయూత అందించింది. బుధవారం టీచర్ ప్రభాకర్ సహకారంతో నాగర్‌కర్నూల్ జిల్లా ట్రైబల్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ పిరంగి ఐదు సైకిళ్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థినులు పాల్గొన్నారు.




రామకృష్ణకు ఘంటసాల అవార్డు అందజేస్తున్న సంస్థ ప్రతినిధులు

## రామకృష్ణకు ఘంటసాల అవార్డు

పెద్దఅంబర్‌పేట, డిసెంబర్ 4: మున్సిపాలిటీ పరిధి కుంట్లూరులోని వేగేశ్న ఫౌండేషన్‌లో ఘంటసాల జయంతిని బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఘంటసాల గుడిలో ఆలయ ధర్మకర్త, ఘంటసాల ఇంటర్నేషనల్ ఫౌండేషన్ ట్రస్ట్ వ్యవస్థాపకుడు వంశీ రామరాజు, మేనేజింగ్ ట్రస్టీ శైలజ సుంకరపల్లి ఘంటసాలకు అభిషేకం చేసి, పూజలు చేశారు. అంతర్జాతీయ గాయకుడు వైఎస్ రామకృష్ణను ఘంటసాల అవార్డుతో సత్కరించారు. అనంతరం ఘంటసాల గానామృతం కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు రవిశంకర్‌ఠాగూర్, రవీంద్ర ఆచార్య, కశ్యప్, వీణ, రాధారాణి, జ్యోతిర్లత, సుధామయి పాల్గొన్నారు.

## బాధిత కుటుంబాలకు ఆర్థిక సాయం


బాధిత కుటుంబాలను పరామర్శిస్తున్న మాజీ ఎంపీ, ఎమ్మెల్యే

చేవెళ్ల రూరల్, డిసెంబర్ 4: చేవెళ్ల మండలంలోని ఆలూర్ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో చనిపోయిన కుటుంబాలను చేవెళ్ల మాజీ ఎంపీ రంజిత్‌రెడ్డి, చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య, కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గం ఇన్‌చార్జి పామెన భీమ్‌భరత్ కలిసి పరామర్శించి, మూడు కుటుంబాలకు రూ.50వేల చొప్పున ఆర్థిక సాయం అందజేశారు. వారి వెంట పొల్యూషన్ కంట్రోల్ బోర్డు మెంబర్ సత్యనారాయణరెడ్డి, నాయకులు షాబాద్ దర్శన్, ముడిమ్యాల పీఏసీఎస్ చైర్మన్ ప్రతాప్‌రెడ్డి, నాయకులు ఉన్నారు.

## ఎల్‌హెచ్‌పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా దశరథ్‌నాయక్

కడ్తాల్, నవంబర్ 4: లంబాడీ హక్కుల పోరాట సమితి రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా మండల కేంద్రానికి చెందిన బీఆర్‌ఎస్ నాయకుడు, మాజీ జడ్పీటీసీ దశరథ్‌నాయక్ నియమితులయ్యారు. బుధవారం షాద్‌నగర్ పట్టణంలోని కేకే కన్వెన్షన్‌లో నిర్వహించిన ఎల్‌హెచ్‌పీఎస్ రాష్ట్ర స్థాయి సమావేశంలో, సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రాంబల్‌నాయక్ నుంచి ఆయన నియామక పత్రాన్ని అందుకున్నారు. ఈ సందర్భంగా రాంబల్‌నాయక్ మాట్లాడుతూ గిరిజనుల జాతి అభ్యున్నతి కోసం దశరథ్‌నాయక్ విశేషమైన సేవలు అందిస్తున్నారని తెలిపారు. లగచర్లలోని గిరిజనులను మద్దతుగా ఆయన చేసిన పోరాటాలకు రాష్ట్ర వ్యాప్తంగా గుర్తింపు లభించిందన్నారు. కార్యక్రమంలో గిరిజన సేవా సంఘం రాష్ట్ర నాయకుడు సేవ్యానాయక్, మాజీ సర్పంచ్ హరిచంద్‌నాయక్, నాయకులు శ్రీనూనాయక్, జగన్‌నాయక్, శ్రీకాంత్, నాయకులు పాల్గొన్నారు.

## వీహెచ్‌పీఎస్ నుంచి తొలగింపు

పెద్దఅంబర్‌పేట, డిసెంబర్ 4: దివ్యాంగుల హక్కుల పోరాట సమితి (వీహెచ్‌పీఎస్) తీసుకున్న నిర్ణయాలకు వ్యతిరేకంగా పనిచేస్తున్న దివ్యాంగుల హక్కుల పోరాట సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గోవర్ధన్‌పై ఆ సమితి చర్యలు చేపట్టింది. గోవర్ధన్‌ను దివ్యాంగుల హక్కుల పోరాట సమితి, మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి నుంచి తక్షణమే తొలగిస్తున్నట్టు వీహెచ్‌పీఎస్ జాతీయ అధ్యక్షురాలు సుజాత శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గతంలో హెచ్చరించినా పట్టించుకోకపోవడంతో తొలగిస్తూ నిర్ణయం తీసుకున్నట్టు ప్రకటించారు.

## వ్యాసరచన పోటీల్లో గెలుపొందిన వైష్ణవి

కందుకూరు, డిసెంబర్ 4 : మండ ల పరిధిలోని నెదునూరు ప్రభుత్వ మోడల్ స్కూల్‌లో చదువుకుంటున్న కొత్తగూడ గ్రామానికి చెందిన ఆశావర్కర్ చీమల అనిత, శేఖర్‌ల కూతురు చీమల వైష్ణవి రాష్ట్ర స్థాయిలో జరిగిన వ్యాసరచన పోటీల్లో గెలుపొందింది. మండల, జిల్లా స్థాయిలో నిర్వహించిన పోటీల్లో గెలిచి రాష్ట్ర స్థాయికి ఎంపికైంది. రాష్ట్ర స్థాయిలో 91 మంది విద్యార్థులు పోటీ పడగా అందులో విద్యార్థిని వైష్ణవి గెలుపొందింది. రాష్ట్ర విద్యాశాఖ డైరెక్టర్ దేవసేన చేతుల మీ దుగా ప్రశంసాపత్రాన్ని అందుకున్నారు. ఈ సందర్భంగా దేవసేన మాట్లాడుతూ.. విద్యార్థులు జాతీయ స్థాయికి ఎదుగాలని కోరారు.

## రేషన్ బియ్యం పక్కదారి..!

కందుకూరు, డిసెంబర్ 4 : పేదలకు ఉచితంగా అందిస్తున్న రేషన్ బియ్యం పక్కదారి పడుతున్నాయి. ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన దళారులు కిలోకు దాదాపు రూ.15 వరకు లబ్ధిదారులకు చెల్లించి వాహనాల్లో తరలిస్తున్నారు. కడ్తాల్, ఆమనగల్లు మండలాల పరిధిలో ప్రతీ నెల మొదటి వారంలో లబ్ధిదారులు రేషన్ తీసుకున్న వెంటనే దళాలు వచ్చి కొనుగోలు చేస్తున్నారు. వీటిని నగరంలోని చాంద్రాయణగుట్ట, ఎల్‌బీనగర్, నల్గొండ, తదితర ప్రాంతాలతో పాటు పౌల్ట్రీ ఫాంలకు విక్రయిస్తున్నారు. ఈ రేషన్ బియ్యాన్ని రైస్ మిల్లుల్లో రీసైక్లింగ్ చేయించి ఆకర్షణీయమైన బస్తాల్లో ప్యాకింగ్ చేస్తున్నారు. ఇలా ప్యాకింగ్ చేసిన సన్నబియ్యాన్ని తిరిగి ప్రజలకు విక్రయించి వ్యాపారులు సొమ్ము చేసుకుంటున్నారు. మరికొందరు సేకరించిన బియ్యాన్ని కోళ్లఫాంలలో అమ్ముకుంటున్నారు.

## రైతుల శ్రేయస్సు కోసం పనిచేయాలి

ఆమనగల్లు, డిసెంబర్ 4: రైతుల శ్రేయస్సు కోసం మార్కెట్ కమిటీ పాలక వర్గాలు పనిచేయాలని రాష్ట్ర పర్యాటక, ఎక్సైజ్ శాఖ మాత్యులు జూపల్లి కృష్ణారావు అన్నారు. ఆమనగల్లు వ్యవసాయ పాలకవర్గ ప్రమాణ స్వీకార కార్యక్రమం బుధవారం పట్టణంలోని లక్ష్మీగార్డెన్‌లో అట్టహాసంగా నిర్వహించారు. కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమానికి రాష్ట్ర పర్యాటక, ఎక్సైజ్ శాఖ మాత్యులు జూపల్లి కృష్ణారావు, సీడబ్లూసీ ప్రత్యేక ఆహ్వానితులు వంశీచంద్‌రెడ్డి, నాగర్‌కర్నూల్ ఎమ్మెల్యే రాజేశ్‌రెడ్డి, పీసీబీ సభ్యుడు ఠాగూర్ బాలాజీసింగ్, టీపీసీసీ సభ్యుడు శ్రీనివాస్‌గౌడ్ ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్‌గా యాట గీత, వైస్ చైర్మన్‌గా గూడూరు భాస్కర్‌రెడ్డి, డైరెక్టర్‌లతో మార్కెటింగ్ శాఖ అధికారి రియాజ్ ప్రమాణ స్వీకారం చేయించారు. అనంతరం జరిగిన సభలో మంత్రి జూపల్లి కృష్ణారావు మాట్లాడుతూ వరికి మద్దతు ధరతో పాటు సన్నాలకు రూ.500 బోనస్ ఇస్తూ వారం రోజుల్లో రైతుల ఖాతాల్లో జమచేస్తుందని అన్నారు. కార్యక్రమంలో ఆర్డీవో జగదీశ్వర్‌రెడ్డి, ఏడీఏ ఆదిలక్ష్మి, తహసీల్దార్ లలిత, మున్సిపల్ కమిషనర్ వసంత, ఏవో శ్రీనివాస్‌గౌడ్, మార్కెట్ కార్యదర్శి శ్రీనివాస్‌రెడ్డి ఉన్నారు.

## ప్రధానమంత్రి సురక్ష బీమాపై అవగాహన


అవగాహన కల్పిస్తున్న ఏపీజీవీబీ మేనేజర్ తిరుపతి

ఆమనగల్లు, డిసెంబర్ 4: సోషల్ సెక్యూరిటీ స్కీమ్స్ ప్రధానమంత్రి సురక్ష భీమా యోజనను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఏపీజీవీబీ మేనేజర్ తిరుపతి అన్నారు. భారత ప్రభుత్వం ఆర్థిక మంత్రిత్వ శాఖ ఆదేశాల మేరకు బుధవారం ఆమనగల్లు మండల పరిధిలోని మంగళపల్లి, తలకొండపల్లి మండల పరిధిలోని గౌరిపల్లి గ్రామంలో గ్రామ స్థాయి జన సురక్ష కార్యక్రమం భాగంగా ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మేనేజర్ తిరుపతి మాట్లాడుతూ సంవత్సరానికి ప్రధానమంత్రి సురక్ష బీమా యోజన పథకంలో రూ.20 చెల్లించి ఏడాదికి రెండు లక్షల ప్రమాద బీమా పొందడానికి అవకాశం ఉందన్నారు. దీనికి 18 నుంచి 70 సంవత్సరాల వయస్సు గల వారు అర్హులన్నారు. ప్రధానమంత్రి జీవనజ్యోతి బీమా యోజన పథకంలో రూ. 436 చెల్లించి రెండు లక్షల జీవిత బీమా పొందవచ్చని తెలిపారు. దీనికి 18 నుంచి 50 సంవత్సరాల వయస్సు వారు అర్హులన్నారు. బ్యాంకు నుంచి ఎలాంటి ఓటీపీలు, సీవీవీ నంబర్లు అడిగే అవకాశం ఉండదని సూచించారు. ఎలాంటి ఫోన్ కాల్స్ వచ్చినా 1930కి కాల్ చేసి ఫిర్యాదు చేయాలన్నారు. కార్యక్రమంలో బ్యాంకు సిబ్బంది, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## మంత్రి సమావేశంలో దొంగల చేతివాటం

ఆమనగల్లు, డిసెంబర్ 4: ఆమనగల్లు పట్టణంలో బుధవారం నిర్వహించిన మంత్రి సమావేశంలో దొంగలు చేతివాటం ప్రదర్శించారు. జేబులను కత్తిరించి రూ. 1.50 లక్షలు కాజేశారు. ఆమనగల్లులోని లక్ష్మీగార్డెన్‌లో ఆమనగల్లు వ్యవసాయ మార్కెట్ పాలకవర్గ ప్రమాణ స్వీకారం ఏర్పాటు చేశారు. కార్యక్రమానికి రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు విచ్చేశారు. మంత్రి వచ్చిన సమయంలో దొంగలు చేతివాటం ప్రదర్శించారు. స్టేజీపై ఉన్న వారితో పాటు కింద సమావేశంలో పాల్గొన్న వారి జేబుల్లో నుంచి నగదును కాజేశారు. తలకొండపల్లి మండలం వెంకట్రావ్‌పేట్ గ్రామానికి చెందిన కానుగుల దశరథంకు చెందిన రూ. 40వేలు. మరికొంత మంది వ్యక్తుల నుంచి రూ.1.10 లక్షలు దొంగిలించారు. డబ్బులు పోగొట్టుకున్న పోలీసులకు ఫిర్యాదు చేశారు.

## రైలు ఢీకొని గుర్తుతెలియని వ్యక్తి మృతి

కొత్తూరు, డిసెంబర్ 4: రైలు ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతిచెందాడు. ఈ ఘటన కొత్తూరు పోలీస్‌స్టేషన్ పరిధిలో మంగళవారం అర్ధరాత్రి జరిగింది. రైల్వే కానిస్టేబుల్ మల్లేశ్ వివరాల ప్రకారం.. కొత్తూరు రైల్వేస్టేషన్ సమీపంలో మంగళవారం రాత్రి మహబూబ్‌నగర్ వెళ్తున్న ట్రైన్ ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. మృతుడు 45 నుంచి 50 ఏండ్ల వయసు ఉంటుందని చెప్పారు. తెల్లటి గడ్డం, గ్రే కలర్ ప్యాంట్ , గ్రే కలర్ టీ షర్ట్ ధరించి ఉన్నాడు. షాద్‌గనర్ స్టేషన్ మాస్టర్ అభిదేశ్ యాదవ్ ఫిర్యాదు మేరకు రైల్వే కానిస్టేబుల్ మల్లేశ్ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. మృతుడి వివరాలు తెలిస్తే 9848090426 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

## గుండ్లకుంటలో కబ్జాలు తొలగించాలి

కొత్తూరు, డిసెంబర్ 4: తిమ్మాపూర్ శివారు పరిధిలోని గుండ్లకుంట, పాటు కాలువ కబ్జాలను తొలగించాలని వారు కొత్తూరు తహసీల్దార్ రవీందర్‌రెడ్డికి బుధవారం వినతిపత్రం అందజేశారు. అనంతరం కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ కొత్తూరు చెరువు కాశన్నకుంట నుంచి వచ్చే నీళ్లు గుండ్లకుంటలోకి వచ్చి అక్కడి నుంచి ఎల్లమ్మ కుంటలోకి వెళ్లేవి అన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని దుబాయ్ వరల్డ్ కంపెనీ వారు కొత్తూరు చెరువు నుంచి వచ్చే నీటిని గుండ్లకుంటలోకి పోకుండా రోడ్డు పక్క నుంచి కాలువ తవ్వి దారి మళ్లించారన్నారు. అదే విధంగా గుండ్లకుంట చెరువునుంచి నీరు పోయే పాటు కాలువను కబ్జా చేసి అక్కడ గోదాములు నిర్మించారని చెప్పారు. తిమ్మాపూర్ శివారులోని సర్వే నంబర్ 141లో అసైన్డ్ భూములను కబ్జాచేసి వాడుకుంటున్నారని ఆరోపించారు. తిమ్మాపూర్ శివారు 141 సర్వే నంబర్ నుంచి పోయే వాగును దారి మళ్లించి, మొదటి ప్రాంతాన్ని పూడ్చారని చెప్పారు. అంతే కాకుండా దారి మళ్లించిన వాగునుంచి చిన్న కాలువ తవ్వి రైతుల పొలాలపై వదిలారని అన్నారు. డీపీ వరల్డ్ కంపెనీ కబ్జాలను తొలగించి చెరువు కబ్జాలు తొలగించారన్నారు. రైతులు నష్టపోకుండా ఉండాలని వినతి పత్రంలో పేర్కొన్నారు. వినతిపత్రంలో ఇచ్చినవారిలో కాంగ్రెస్ మున్సిపల్ అధ్యక్షుడు సుదర్శన్‌గౌడ్, పీర్లగూడెం మహేశ్, నవీన్‌చారి, జనార్దనాచారి, కృష్ణ, జైపాల్‌రెడ్డి, సత్యనారాయణ, నర్సింహ, ఘనీ, గోవింద్‌నాయక్ పాల్గొన్నారు.

## ఉచిత వైద్యశిబిరానికి విశేష స్పందన

**వెల్‌స్పన్ ఫౌండేషన్ సీఎస్‌ఆర్ హెడ్ సురేఖ**

షాబాద్, డిసెంబర్ 4: గ్రామీణ ప్రాంతాల్లోని పేద ప్రజలు ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని వెల్‌స్పన్ ఫౌండేషన్ సీఎస్‌ఆర్ హెడ్ సురేఖ అన్నారు. బుధవారం షాబాద్ మండల పరిధిలోని నాగరగూడ గ్రామంలో వెల్‌స్పన్ ఫౌండేషన్, ఏబీవీ దవాఖాన ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరం ఏర్పాటు చేశారు. ఈ శిబిరంలో 110మంది వరకు పాల్గొని వైద్యపరీక్షలు చేయించుకున్నారు. ఈ సందర్భంగా సురేఖ మాట్లాడుతూ... ఉచిత వైద్యశిబిరంలో పేదలందరికీ బీపీ, షుగర్ తదితర వైద్యపరీక్షలు నిర్వహించి మందులు అందించడం జరిగిందన్నారు. గ్రామస్తులకు కీళ్లు, సాధారణ వ్యాధులకు సంబంధించిన వైద్య నిపుణులు వైద్యపరీక్షలు నిర్వహించి అవసరమైన మందులు అందించినట్లు తెలిపారు. కార్యక్రమంలో గ్రామ మాజీ సర్పంచ్ కృష్ణగౌడ్, వెల్‌స్పన్ ఫౌండేషన్ ప్రాజెక్ట్ మేనేజర్ భద్రయ్య, పవన్‌కుమార్, శిరీష, రమేశ్, ఏబీవీ దవాఖాన సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.



వైద్యశిబిరంలో పరీక్షలు నిర్వహిస్తున్న సిబ్బంది